సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 21 । మార్చి । 2023



దుంగలు దాచి.. పోలీసులకు దొరికి..

గుట్టుగా ఎర్రచందనం దుంగలను దాచిన ఐదుగురు స్మగ్లర్లు పోలీసులకు దొరికిపోయారు. -8లో..



ఇద్దరు దొంగల అరెస్ట్

ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 18 కెమెరాలు, రెండు డ్రోన్ కెమెరాలు స్వాధీనం చేసుకున్నారు. -8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.6/23.4

జిల్లాలో సోమవారం 23.4 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వచన కవిత పోటీలకు సంపుటాల ఆహ్వానం

కడప కల్చరల్ : పల్లా జాతీయ కవితా పురస్కారం-2023 కోసం వచన కవిత సంపుటాలను ఆహ్వానిస్తున్నామని నిర్వాహకులు డాక్టర్ పల్లా కృష్ణ తెలిపారు. ఏ ప్రాంతానికి చెందిన కవులైనా ఈ పోటీకి 2020-23 మధ్యకాలంలో ప్రచురితమైన తమ వచన కవితా సంపుటాలను మాత్రమే మార్చి 30లోగా పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99851 93868 నంబరులో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ కళాశాల వారు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) 4.0లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 3 నెలల కాల వ్యవధి గల కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగినవారు అర్హులని తెలిపారు.అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసోసియేట్ డేటాఎంట్రి ఆపరేటర్, టూవీలర్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు.

1183 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ పరీక్షలకు 1183 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాల్లో 25,438 మందికిగాను 24,255 మంది హాజరయ్యారు. 95.35 శాతం నమోదైంది. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని వేర్వేరు పరీక్షా కేంద్రాలలో 8 మంది, బద్వేల్ పరీక్షా కేంద్రంలో ఒకరు చూచిరాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డీబార్ చేసినట్లు ఆర్ఐవో రమణరాజు తెలిపారు.

ఉత్తమ రైతుగా ఎంపిక



సదా శివారెడ్డి

చాపాడు: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22న గుంటూరులో నిర్వహించే ఉగాది పురస్కారాలకు ఉత్తమ రైతుగా మండలంలోని రాజుపాళెం గ్రామానికి చెందిన రైతు లోమడ సదా శివారెడ్డికి ఆహ్వానం అందింది. సదాశివారెడ్డి వ్యవసాయంలో ఆచరించిన వినూత్న పద్ధతులు, సాధించిన విజయాల నేపథ్యంలో ఉగాది పురస్కారం అందుకోనున్నారు.

మైదుకూరుకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు

చాపాడు: మైదుకూరు నియోజకవర్గానికి ప్రభుత్వ కళాశాల మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్- 5 విడుదల చేసింది. రూ.34.97 కోట్లతో అత్యాధునికంగా మైదుకూరు నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మించనున్నట్లు జీఓలో పేర్కొంది. ఈ మేరకు సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కడప జిల్లాలో మైదుకూరు, నంద్యాల జిల్లాలో బేతంచర్ల, అనంతపురం జిల్లాలో గుంతకల్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం గజిట్ విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కడప అర్బన్: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదులపట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరగా వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు తమ నైపుణ్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి సూచించారు. జిల్లావ్యాప్తంగా 220 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం(ఈఎండీపీ)పై 8 నెలలుగా శిక్షణ ఇస్తున్నారు.సోమవారం కడపలోని సీఎస్ఐ స్కూల్లో జిల్లాస్థాయి ఈఎండీపీ ఎక్స్‌పో 2023 నిర్వహించి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఏఎంఓ ధనలక్ష్మి ప్రారంభించగా జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి పరిశీలించారు. సీఎంఓ కేశవరెడ్డి, ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఎంఓ రామాంజులరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ శోభ!

- ఈనెల 30 నుంచి రాములోరి బ్రహ్మోత్సవాలు
- చకచకా..కల్యాణవేదిక ప్రాంగణం పనులు
- ఏప్రిల్ 5న సీతారాముల కల్యాణం
- హాజరుకానున్న ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్



రామయ్య కోవెల వద్ద చలువ పందిళ్ల నిర్మాణాలు

సాక్షి రాయచోటి/ఒంటిమిట్ట/రాజంపేట: ఏకశిలానగరిలో రాములోరి పండుగకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒంటిమిట్టలోని కోదండ రాముని బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల-తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కోదండరాముడి కల్యాణోత్సవాన్ని ఈసారి మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. మార్చి 30 నుంచి అంబరాన్ని అంటేలా రాములోరి సంబరాలు జరగనున్నాయి.

టీటీడీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవ వైభవానికి ముందే ఆలయం చుట్టూ మాఢవీధుల్లో రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో అందంగా కనిపిస్తున్నాయి. ఆలయ సమీపంలో పుష్కరిణిని కూడా తీర్చిదిద్దారు. ఆలయ దక్షిణ గోపురం ముందు భాగాన పార్కును పూర్తి చేయడంతో పచ్చదనంతో కళకళలాడుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో అనేక రకాల అభివృద్ధి పనులను పూర్తి చేశారు.

శాశ్వత కల్యాణ మండపం

ఒంటిమిట్టలోని విశాల మైదానంలో సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించి శాశ్వత మండపాన్ని నిర్మించారు. వేలాది మంది భక్తులు కూర్చొని కల్యాణాన్ని తిలకించే ఏర్పాట్లు చేస్తున్నారు. శాశ్వత నిర్మాణాలతోపాటు చలువ పందిళ్లు వేస్తున్నారు. ఆలయ సమీప ప్రాంతాలన్నింటిలోనూ వెలుగులు నింపేందుకు ఎక్కడికక్కడ లైటింగ్ సిస్టమ్‌ను అమర్చారు.

ఏప్రిల్ 5న రాములోరి కల్యాణం

ఒంటిమిట్ట ఆలయ సమీపంలోని విశాల మైదానంలో ఏప్రిల్ 5న పౌర్ణమి చంద్రుని సాక్షిగా సీతారాముల కల్యాణాన్ని వేలాది భక్తుల మధ్య పండుగ వాతావరణంలో కడు రమనీయంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు గవర్నర్, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. అలాగే ప్రతిరోజు స్వామి వారి సంకీర్తనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తుల సందడితో ఏకశిలానగరం అలరారనుంది.

అన్నప్రసాదాల వితరణకు ముందుకొచ్చిన మేడా

సీతారాముల కల్యాణం రోజున 80వేల మందికి అన్నప్రసాదాల వితరణ చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం కోరిన మేరకు టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ మేడా రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డిలు ముందుకొచ్చారు. ఈమేరకు టీటీడీ ఈఓ, జేఈఓలతో చర్చించారు.

వేగవంతంగా ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వేగవంతంగా చర్యలు చేపడుతున్నారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఇప్పటికే పలుమార్లు పర్యటించి పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా గ్యాలరీల నిర్మాణం, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, వసతి సౌకర్యాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేయనున్నారు. వాహనాల పార్కింగ్, వీవీఐపీల తాకిడి నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు, తలంబ్రాల ప్యాకెట్ల పంపిణీ మొదలుకొని ఇలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ప్రణాళికాబద్ధంగా చర్యలు




ఒంటిమిట్టలో కోదండ రాముని బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవానికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. 5న జరిగే కల్యాణోత్సవం సందర్భంగా కల్యాణవేదిక, పరిసర ప్రాంగణం పనులు, భక్తుల సౌకర్యాల పనులపై దృష్టి సారించారు. -వీరబ్రహ్మం, జేఈఓ, టీటీడీ, తిరుపతి

రాగి జావ.. పోషకాల తోవ

- గోరుముద్ద పథకం మెనూలో చేరిన రాగిజావ
- నేటి నుంచి అన్ని పాఠశాలల్లో అమలు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



రాగి జావ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని (మధ్యాహ్న భోజనం) పటిష్టంగా అమలు చేస్తోంది. ఇప్పటికే పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి నాణ్యత, రుచికి పెద్ద పీట వేశారు. కోడిగుడ్లు, చిక్కీ వంటి అధిక ప్రోటీన్లు, విటమినులు ఉండే పదార్థాలను చేర్చారు. అలాగే పులిహోరా, వెజిటబుల్ రైస్ (ఫ్రైడ్ రైస్) కిచిడీ, తీపి పొంగలి వంటి రుచికరమైన పదార్థాలను వడ్డిస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. తాజాగా మరిన్ని పోషకాలతో కూడిన ద్రవ పదార్థాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారానికి మూడు రోజులు రాగిజావ అందించేందుకు శ్రీకారం చుట్టింది. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావను అందించనున్నారు.

చిక్కీకి ప్రత్యామ్నాయ రోజుల్లో..

వారంలోని సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు చిక్కీని అందిస్తున్నారు. మంగళ, గురు, శని వారాల్లో చిక్కీకి ప్రత్యామ్నాయంగా రాగి జావను అందించేలా నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిపండి, 10 గ్రాముల బెల్లంపొడితో తయారు చేసిన 150 మిల్లీలీటర్ల రాగి జావ పంపిణీ చేయనున్నారు. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2048 పాఠశాలల్లో...

జిల్లాలోని 2048 ప్రభుత్వ పాఠశాలల్లో 1,48,804 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 1621 ప్రాథమిక పాఠశాలల్లో 77,357 మంది, 171 ప్రాథమికోన్నత పాఠశాలలో 43,611 మంది, 256 ఉన్నత పాఠశాలల్లో 27,836 మంది విద్యనభ్యసిస్తున్నారు.జిల్లాలోని 36 మండలాల్లో 2048 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలవుతుండగా 3667 మంది మధ్యాహ్న భోజనం కార్మికులు పనిచేస్తున్నారు. రాగిజావ తయారీకి అవసరమైన ముడి సరుకు ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరింది. పాఠశాలలు ఉండే ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు సరుకులను సరఫరా చేశారు.

చాలా ప్రయోజనం



రాగి జావతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో తక్కువ కొలెస్ట్రాల్, సోడియం ఉంటుంది. మనిషిలో పోషకాహార లోపాన్ని నివారించడానికి దోహదపడుతుంది.గుండె ఆరోగ్యాన్ని మెరుపరచడానికి బాగా పనిచేస్తుంది. - అర్జున్‌కుమార్, వైద్య నిపుణులు

అన్ని ఏర్పాట్లు చేశాం...



జిల్లాలో విద్యార్థులకు రాగి జావ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వం నుంచి గ్లాసులు వచ్చేందుకు కొంత ఆలస్యమయ్యేలా ఉంది. విద్యార్థులు రాగి జావ తాగేందుకు ఇంటి నుంచి గ్లాసులు తెచ్చుకోవాలి. - రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



పెండ్లిమర్రి: దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి/వీరపునాయనిపల్లె/వేంపల్లి: జిల్లాలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం ద్వారా న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పెండ్లిమర్రి మండలంలోని సోగాల్‌పల్లె, కొత్త గంగిరెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామ పొలాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలు, వడగండ్ల వాన దాటిగా అరటి, చీనినిమ్మ,వరి, దోస, నూగు పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి.ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తారన్నారు. వీరపునాయునిపల్లె మండలంలో కలెక్టర్ విజయరామరాజు పర్యటించారు.తంగెడుపల్లె గ్రామంలో దెబ్బతిన్న అరటి, నిమ్మ, నూగు పంటలను జేసీ సాయి కాంత్‌వర్మతో పరిశీలించారు. పంట నష్టం జాబితాను సిద్ధం చేయాలని వ్యవసాయ, అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను పునరుద్ధరించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వేంపల్లె మండలంలో కలెక్టర్ పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.నష్టానికి సంబంధించిన నివేదికను రెండురోజుల్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడారు. అమ్మగారిపల్లె, వేంపల్లె, ఇడుపులపాయ, కుమ్మరాంపల్లె తదితర గ్రామాల్లో పంటనష్టం ఎక్కువగా జరిగిందని రైతులు కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకెదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయరామరాజును కలిశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

కడప సిటీ : స్పందనలో వచ్చిన అర్జీలపై దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ సాయికాంత్ వర్మ, డీఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీ యదుభూషణ రెడ్డి, ఆనంద నాయక్, డీఎంహెచ్‌ఓ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

- ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అధిగమిద్దామని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. రెండు నెలలపాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు.
- జిల్లాలో ఆధార్ సీడింగ్ వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

చిరుధాన్యాలు ఆరోగ్యాన్ని ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ వద్ద డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖలు, కేవీకే సంయుక్తంగా చిరుధాన్యాల (మిల్లెట్) ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశాయి. దీనిని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చిరు ధాన్యాల ఉత్పత్తిని, వాటి వినియోగాన్ని పెంచడం, తద్వారా ప్రజల ఆరోగాన్ని పెంపొందించడంలో భాగంగా ఈ స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కసూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన పరిశీలన



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు

చాపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రావు సందర్శించారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసరు ప్రభాకర్‌రెడ్డితో కలసి పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అక్కడి విద్యార్థులు, సిబ్బందితో కలసి రాష్ట్ర కార్యదర్శి మధ్యాహ్న భోజనం చేశారు.మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రవిశంకర్, కస్తూర్బా స్పెషలాఫీసరు నాగలక్ష్మీ, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది మహేష్, శ్రీను తదితరులు తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారం పెంచాలని ర్యాలీ



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

చాపాడు: బెంగుళూరు-విజయవాడ మధ్య కేంద్ర ప్రభుత్వం నిర్మించే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేయాలని సోమవారం కడప కలెక్టరేట్ కార్యాలయం వద్ద బాధిత రైతులు ర్యాలీ చేపట్టారు. చాపాడు మండలంలోని కేతవరం, అల్లాడుపల్లె, లక్ష్మీపేట, బద్రిపల్లె ఇంకా పలు గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూ బాధిత రైతులు మాట్లాడుతూ.. జాతీయ రహదారి సమీపంలోని భూములకు ఎకరాకు రూ.24లక్షలు, లోపలికి ఉండే భూములకు రూ.15లక్షలు చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. హైవేలో భూములు కోల్పోతే జీవనాధారం కోల్పోతామన్నారు. ఈ ప్రాంతంలో బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరా రూ.2-3 కోట్లు పలుకుతోందని, ఈ మేరకు ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే మండల, డివిజనల్ స్థాయిలో అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సర్కిల్ విజయవాడ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లాది హరిప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప పోస్టల్ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, వివిధ రకాల ఖాతాల తీరుపై తనిఖీ చేసేందుకు తమ బృందం వచ్చిందన్నారు. గతంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఉండే వారని, ఇప్పుడు డాక్టర్లు, లాయర్స్, గ్రాడ్యుయేట్స్, జర్నలిస్టులు కూడా చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో సేవింగ్స్ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గౌస్ ఆజామ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు ఎస్‌వీ శ్రీనివాసమూర్తి, ప్రసన్న వెంకటసాయి, విజయ్ భాస్కర్, రామశంకర్, పీఎల్‌ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.



దుంగలు దాచి.. పోలీసులకు దొరికి..

- ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్
- 11 దుంగలు, స్కార్పియో స్వాధీనం
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

కడప అర్బన్ : గుట్టుగా ఎర్రచందనం దుంగలను దాచిన ఐదుగురు స్మగ్లర్లు పోలీసులకు దొరికి పోయారు. వారి వద్ద నుంచి దాదాపు 250 కిలోల బరువున్న 11 ఎర్రచందనం దుంగలు, స్కార్పియో వాహనం, ఐదు సెల్‌ఫోన్‌లు, రెండు గొడ్డళ్లు, ఇనుప రంపం స్వాధీనం చేసుకున్నారు. కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి వాటర్‌గండి సమీపంలోని శివాలయం వెనుక గుంపుగా వున్న చెట్ల మధ్యలో ఎర్రచందనం దుంగలను దాచి.. అక్రమ రవాణాకు సిద్ధం చేస్తుండగా ఐదుగురు స్మగ్లర్లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా ఆరూర్ తాలూకా వేలనూర్ పోస్టు వనమదొర్రై గ్రామానికి చెందిన రజనీకాంత్ అలియాస్ షణ్ముగం, అదే గ్రామానికి చెందిన రవి, సేలం జిల్లా యెర్కాడ్ తాలూకా మధుర్ గ్రామానికి చెందిన రమేష్, ధర్మపురి జిల్లా నమ్మన్‌ఘడ్ గ్రామానికి చెందిన పళని మురగస్, కలగుర్చి జిల్లా కొడమతి గ్రామానికి చెందిన గణేశన్‌గా గుర్తించారు. షణ్ముగంపై ఇప్పటికే 1 కేసు ఉంది. ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ నాగభూషణ్, చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందికి జిల్లా ఎస్పీ నగదు రివార్డులను అందజేసి అభినందించారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

కడప అర్బన్ : చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. కడపకు చెందిన కదిరి నాగేంద్ర కిరణ్ నుంచి షామీర్‌బాషా రూ.26 లక్షలు అప్పుగా తీసుకుని చెల్లని చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ కేసును జిల్లా కోర్టులో రెండవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ సోమవారం విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది పాటు జైలుశిక్షను విధించడంతోపాటు రూ.19 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-కనుమలోపల్లె మార్గంలో ఎగువ రైలు పట్టాలపై సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. కడప రైల్వే ఎస్‌ఐ రారాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి వయసు 45-50 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని కడపలోని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతునికి సంబంధించిన వారు తమను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

23 ఎర్రచందనం దుంగల స్వాధీనం


దుంగలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పోరుమామిళ్ల : మండలంలోని టీకూరుపేట, కవలకుంట్ల ప్రాంతాల్లో ఆదివారం 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఐదుగురిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు సోమవారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్‌ఎస్‌ఐ రాఘవేంద్ర సిబ్బందితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కొమ్మినేని రస్తాలో కారులో దుంగలు లోడ్ చేస్తుండటం గమనించి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా పరారయ్యారు. వెంటపడి ఐదుగురిని పట్టుకున్నారు. వారిలో పోరుమామిళ్లకు చెందిన పాలగిరి నాగార్జున(32), పెద్దిటి నాగరాజు(35), గుజ్జుల వెంకటేశ్వర్లు(42), చిలమల వెంకటయ్య(62), పులివెందులకు చెందిన నీరెడ్డుల ప్రకాష్(20) ఉన్నారు. వారి నుంచి కారు, బైక్‌తో సహా 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- నిందితులు రాజస్థాన్ వాసులు
- రూ.8 లక్షల విలువైన కెమెరాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 18 కెమెరాలు, రెండు డ్రోన్ కెమెరాలు, మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్‌లు తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని స్మార్ట్ కెమెరాస్ దుకాణం షట్టర్‌ను మధ్యలో బలవంతంగా గుణపంతో తెరిచి, కెమెరాలు, డ్రోన్ కెమెరాలు చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు కెమెరాలతోపాటు పరారవడం కోసం కడప రైల్వేస్టేషన్‌లో ఉండగా.. అదుపులోకి తీసుకున్నారు. వారిని రాజస్థాన్ రాష్ట్రం బర్మర్ జిల్లా గోలియా గర్వ గ్రామానికి చెందిన కమలేష్‌కుమార్, జలార్ ద్యుర గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌గా గుర్తించారు. వీరిని పోలీసులు విచారణ చేస్తే.. తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కమలేష్‌కుమార్ ఇంటర్మీడియెట్ వరకు చదువుకుని తదుపరి ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తూ.. ఆ వృత్తిని వదిలేసి కడపకు వచ్చాడు. ఓ ఐరన్ షాపులో పని చేస్తూ వున్నాడు. తాను ఇష్టపడిన ఫొటోగ్రఫీ వృత్తి మీద కోరికను చంపుకోలేక కెమెరాల కోసం చూస్తున్నాడు. కడపలోని స్మార్ట్ కెమెరాస్ దుకాణంలో ఖరీదైన కెమెరాలు వుండటం గమనించాడు. కెమెరాలు దొంగలిస్తే తన ఫొటోగ్రఫీ వృత్తిని కొనసాగించవచ్చని, అలాగే కొంత డబ్బు సంపాదించవచ్చని భావించాడు. తనతోపాటు పని చేసే ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పథకం ప్రకారం చోరీకి పాల్పడ్డాడు. వారిని 48 గంటల్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 18 కెమెరాలు, రెండు డ్రోన్ కెమెరాలు, మూడు ఖరీదైన లెన్స్‌లు, నేరానికి ఉపయోగించిన మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్‌లు, గుణపం స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, పోలీస్ సిబ్బందికి ఎస్పీ నగదు రివార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, సిబ్బంది పాల్గొన్నారు.

24 గంటల్లోనే చైన్‌స్నాచర్ ఆటకట్టు

- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రూ.1.20 లక్షల విలువైన బంగారు గొలుసు రికవరీ

కడప అర్బన్ : చైన్ స్నాచర్‌ను 24 గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట్ చేసి, అతని ఆటకట్టించారు. కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం మీడియా ఎదుట నిందితుడిని హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. శనివారం సాయంత్రం కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకాష్‌నగర్‌కు చెందిన పుల్లగూర దానమ్మ నడుచుకుంటూ వెళుతుండగా.. ఆమెను అనుసరిస్తూ ఓ యువకుడు స్కూటీపై వస్తున్నాడు. అదును చూసుకుని ఆమె మెడలోని రూ.1.20 లక్షల విలువైన 20 గ్రాముల బరువున్న బంగారుచైన్‌ను బలవంతంగా లాక్కెళ్లి పరారయ్యాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేరానికి పాల్పడిన సిద్దవటం మండలం టక్కోలు పంచాయతీ దేగలవాండ్లపల్లి గ్రామానికి చెందిన కంచెర్ల దేవేందర్‌రెడ్డిని పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అతన్ని ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రి - తిరుపతి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లె క్రాస్ రోడ్డులో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బంగారు చైన్‌తోపాటు, నేరానికి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దేవేందర్‌రెడ్డి ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌లకు పాల్పడుతూ డబ్బులను పోగొట్టుకుని దొంగతనానికి పాల్పడ్డాడు. కావున యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సూచించారు. వారి పిల్లల సెల్‌ఫోన్‌లను అప్పడప్పుడూ చెక్ చేస్తూ, అలాగే వారి ప్రవర్తనపై నిఘా వుంచాలని పేర్కొన్నారు. చెడు అలవాట్ల వైపు పోకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసిన చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్‌ఐలు ఎస్‌కే రోషన్, జి.అమర్‌నాథ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పి.జంపాల ప్రసాద్, పీవీ శ్రీనివాసులు, ఎ.శివప్రసాద్, పి. ఖాదర్ హుసేన్‌కు జిల్లా ఎస్పీ నగదు రివార్డులను అందజేశారు.

చీటీ డబ్బులు ఎగవేత.. వ్యక్తి మృతి

- తీవ్ర మానసిక వేదనతో గుండెపోటు
- మృతదేహంతో బాధితుల నిరసన
- నిందితులపై చీటింగ్ కేసు నమోదు


నారాయణ (ఫైల్)

కడప అర్బన్ : చీటీ డబ్బుల ఎగవేతతో.. ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందాడు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శంకరాపురం భారతీబార్ వీధిలో నివాసం వుంటున్న మజారి లక్ష్మీదేవి అలియాస్ ఎల్లమ్మ చీటీలు నడుపుతుండేది. ఆమె దగ్గర అదే ప్రాంతానికి చెందిన ఉమ్మడిశెట్టి నారాయణ (48) పదేళ్లుగా చీటీలు వేశాడు. ఆయన కడప కార్పొరేషన్‌లో నీటి కుళాయిలు, నీటి పన్నులకు సంబంధించిన బిల్ కలెక్టర్ పని చేసే వాడు. ఆయనకు భార్య రాజేశ్వరితోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో లక్ష్మీదేవి చీటీలు వేసిన వారికి డబ్బులు ఇవ్వకుండా పరారైంది. ఆమె నుంచి నారాయణకు దాదాపు రూ.13 లక్షల వరకు రావాల్సి ఉంది. పెద్ద కుమార్తెకు పెళ్లి చేయాలనుకుని ఆయన డబ్బులు పోగు చేశాడు. ఈ నేపథ్యంలో డబ్బులు రాకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురై ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. సోమవారం ఉదయం మృతుడి భార్య రాజేశ్వరి, బంధువులు మృతదేహాన్ని తీసుకుని వెళ్లి నిందితురాలి బంధువు కూరాకు రాజా ఇంటి ముందు నిరసన తెలియజేశారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా వున్న తన భర్త ఆకస్మికంగా మృతి చెందడంతో వీధిన పడ్డామని మృతుడి భార్య రోదించింది. దాదాపు 20 మంది వద్ద నుంచి కోటిన్నర మేరకు డబ్బులు తీసుకుని పరారైందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి, చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. నారాయణ, కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 4న లక్ష్మీదేవి, ఆమె బంధువులపై చీటింగ్ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. వారిలో లక్ష్మీదేవి కుమార్తెకు, బంధువు కురాకు రాజాకు 41 కింద నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీసుల జోక్యంతో బాధితులు నిరసన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళ్లారు.

మరువలేని మధుర క్షణాలవి!

- ప్రధాని మోదీతో మాటామంతీ
- పర్యటన ముగించుకుని వచ్చిన హాస్టల్ విద్యార్థులు


ఢిల్లీలో దేశ ప్రధాని నరేంద్రమోదీతో హాస్టల్ విద్యార్థులు (ఫైల్)

కడప రూరల్ : విద్య, ఆర్థిక అక్షరాస్యత కింద ఢిల్లీ పర్యటనలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలువడం, ఆయనతో ముచ్చటించడం జీవితంలో ఎన్నటికీ మరువలేని మధుర క్షణాలని హాస్టల్ విద్యార్థులు తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో 13 మంది ఎస్సీ హాస్టల్ విద్యార్థులను విద్య, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఇండియన్ బ్యాంకు సహకారంతో ఢిల్లీ పర్యటనకు తీసుకెళ్లారు. వారు జిల్లాకు చేరుకున్న తర్వాత సోమవారం సాయంత్రం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్ పర్యటన వివరాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కడప హాస్టల్ విద్యార్థి అమూల్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీని కలుస్తానని, కలిసినా మాట్లాడగలనని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ పర్యటన వల్ల వైద్య విజ్ఞాన రంగాలకు సంబంధించి పలు అంశాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ప్రొద్దుటూరు హాస్టల్ విద్యార్థి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రాజధాని ఢిల్లీలో పలు ప్రాంతాలలో పర్యటించడంతోపాటు ప్రధాని మోదీతో మాట్లాడటం, ఆయన తమకు సూచనలు, సలహాలు ఇవ్వడం ఎన్నటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆ శాఖకు చెందిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పద్మజ, నాగరాజునాయక్, ఇండియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ అరుణ, మేనేజర్ మహబూబ్‌బాష, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బద్వేలు పురపాలక సంఘము

ఆర్.ఓ.సి. నెం.70/2023/ఎ1, తేది : 20.03.2023

బహిరంగ వేలపు ప్రకటన

బద్వేలు పురపాలక సంఘమునకు చెందిన కూరగాయల మార్కెట్లు మరియు గేటు, మాంసం, చేపల మార్కెట్లు 2023-24 సంవత్సరమునకు అనగా 01.04.2023 నుండి 31.03.2024 తేదీ అర్ధరాత్రి వరకు గజిట్ ప్రకారము ఫీజులు వసూలు చేసుకొనే గుత్త హక్కులను తేది:- 25.03.2023 గురువారం ఉదయము 11.00 గం లకు మునిసిపల్ ఆఫీసు ఆవరణలో కమీషనరు వారిచే గానీ, అధికారము పొందిన వారిచే గానీ బహిరంగవేలము వేయబడును. అవసరమగుచో తదుపరి దినములలో కూడా వేలము వేయబడును. ఈ వేలము 1965 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల చట్టము మరియు విధులు వేలపు ప్రకటనలోని షరతులు మరియు అస్తుల్ షెడ్యూలుకు లోబడి యుండవలెను. గుత్తల వేలము విడివిడిగా వేయబడును. ధరావత్తు బ్యాంకు డి.డి./ నగదు డిపాజిట్ రూపములో చెల్లించి, వేలములో పాల్గొనువారు ఈ ప్రకటన షరతులకు లోబడి వేలములో పాల్గొనవలెను. వేలమునకు పాల్గొనువారు వేలమునకు ముందు వేలపు షరతులు పూర్తిగా అంగీకరించినట్లు వ్రాతమూలకముగా కమీషనరు గారికి తెలుపవలెను. వేలము వేయబడు గుత్తలు వేలమునకు ముందుగా ఈ క్రింద తెలిపిన మొత్తము వేలము డిపాజిట్లు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను.

వ.నెం	గుత్త వివరములు	గుత్త కాలము	వేలమునకు ముందు కట్టవలసిన ధరావత్తు		కమీషనర్/ మండల రెవిన్యూ సాల్వెన్సీ పత్రము	కేంద్రప్రభుత్వ సేవా పన్ను ప్రభుత్వము వారి ఉత్తర్వుల మేరకు అప్పటికి అమలులో ఉన్న పర్సెంటేజి ప్రకారము
1	కూరగాయల మార్కెట్ మరియు గేటు	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ. 15,00,000/-	రిజిస్ట్రరు అగ్రిమెంటు కార్యాలయమునకు సమర్పించవలెను. అమలులో ఉన్న సబ్ రిజిస్ట్రారు మార్కెట్ విలువల ప్రకారము	రూ. 3,00,000/-	18% (హెచ్చుపాటపై)
2	మాంసపు, చేపల మార్కెట్	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ. 1,00,000/-		రూ. 1,00,000/-	
3	మేకలు మరియు పొట్టేళ్ల సంత	01.04.2023 నుండి 31.03.2024 వరకు	రూ. 1,00,000/-		రూ. 1,00,000/-	

పైన తెలిపిన గుత్త వేలములో హెచ్చుపాట ఖాయపరచిన వారు గుత్తమొత్తమును 'టేబుల్ పేమెంట్' గా చెల్లించవలెను అనగా ఒకేసారి గుత్తమొత్తమును పూర్తిగా చెల్లించవలెను మరియు 7 రోజుల లోపల తమ స్వంత ఖర్చులతో సబ్-రిజిస్ట్రారు వారి కార్యాలయములో గుత్త అగ్రిమెంటును రిజిస్టర్ చేయించుకోవలెను. అట్లుల గుత్త రిజిస్టరు చేయనియెడల గుత్తను రద్దుపరచబడును. మిగతా వివరములు ఆఫీసు నందు తెలుసుకోవలసినదిగా తెలుపడమైనది.

Sd/- K. V. Krishna Reddy, కమీషనర్, బద్వేలు పురపాలకసంఘము.

గమనిక: వేలములో పాల్గొనే వారు పురపాలక సంఘమునకు ఎటువంటి బకాయిలు అనగా ఇంటిపన్ను, నీటి పన్ను, అంగళ్ళ పన్నుల బాకీ వుండరాదు. వేలము పాటలో పాల్గొనదలచిన పూర్వపు గుత్తదారులు పురపాలక సంఘమునకు పూర్తి బకాయిని చెల్లించి వేలము పాటలో పాల్గొనవచ్చును.

పురపాలక సంఘ కార్యాలయము, పులివెందుల.

ఆర్.ఓ.సి. నెం.309/ఎ1/2017 తేది : 20.03.2023

బహిరంగ వేలము ప్రకటన

వై.ఎస్.ఆర్ జిల్లా గెజిట్ నెం. 23/2023 నందు ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారము 2023-24 సంవత్సరమునకు అనగా 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ పురపాలక సంఘమునకు సంబంధించిన ఈ దిగువన తెలిపిన ప్రదేశములలో ఫీజులు వసూలు చేసుకొనుటకు గుత్త హక్కు కొరకు తేది 27-03-2023, సోమవారము ఉదయము 11.00 గం.లకు కమీషనరు వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని మునిసిపల్ ఆఫీసు కౌన్సిల్ హాలు నందు బహిరంగ వేలము వేయబడును. వేలములో పాల్గొనువారు ధరావత్తు మొత్తమును కమీషనరు, పులివెందుల పురపాలక సంఘము పేరు మీద డిడిని తేది. 25-03-2023 సాయంకాలం 5.00 గం.లకు లోపల సమర్పించవలెను. గుత్త వివరములకు ఎదురుగా తెలిపిన విలువకు సాల్వెన్సీ సర్టిఫికేట్ సమర్పించిన వారు మాత్రమే వేలములో పాల్గొనవలెను మరియు ఆఫీసు వేళలలో ఆఫీసు నందు తెలుసుకోనవచ్చును.

వ.నెం	గుత్త వివరములు	గుత్త కాలము	వేలమునకు ముందు కట్టవలసిన ధరావత్తు		కమీషనరు/ మండల రెవిన్యూ సాల్వెన్సీ పత్రము	కేంద్రప్రభుత్వ సేవా పన్ను ప్రభుత్వము వారి ఉత్తర్వుల మేరకు అప్పటికి అమలులో ఉన్న పర్సెంటేజి ప్రకారము
1	కూరగాయల మార్కెట్	01.04.2023 to 31.03.2024	Rs. 13.00 Lakhs	రిజిష్టరు అగ్రిమెంటు కార్యాలయమునకు సమర్పించవలెను. అమలులో ఉన్న సబ్ రిజిస్ట్రారు మార్కెట్ విలువల ప్రకారము	Rs. 10.00 Lakhs	18%
2	నిలుపబడిన వాహనముల స్టాండు	01.04.2023 to 31.03.2024	Rs. 10.00 Lakhs		Rs. 10.00 Lakhs	
3	మాంసపు మార్కెట్	01.04.2023 to 31.03.2024	Rs. 2.00 Lakhs		Rs. 2.00 Lakhs	

గమనిక: వేలమునకు సంబంధించిన వివరముల కొరకు ఆఫీసు సమయములో రెవెన్యూ విభాగము నందు సంప్రదించవలెను.

సకాలములో పన్నులు చెల్లించండి పట్టాణాభివృద్ధికి తోడ్పడండి

కమీషనరు,
పులివెందుల పురపాలక సంఘము